

శనివారం ఉష్ణోగ్రత	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం :	33	23
భద్రాద్రి కొత్తగూడెం :	36	25





లోక్‌సభపై ఫోకస్

- త్వరలో వెలువడనున్న ఎన్నికల షెడ్యూల్
- అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై పార్టీల కసరత్తు
- సభలు, సమావేశాలకు సన్నాహాలు
- ఖమ్మం టికెట్‌కోసం కాంగ్రెస్‌లో తీవ్రపోటీ

త్వరలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రాబోతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ప్రధాన రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. అధికార విపక్షపార్టీలు ఎన్నికల కార్యాచరణపై దృష్టిసారించాయి. సభలు, సమావేశాలు యాత్రలతో ప్రచారానికి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఒకవైపు అభ్యర్థుల ఎంపిక కసరత్తు కొనసాగుతుండగానే మరోవైపు ప్రచార కార్యక్రమాలపై కూడా పార్టీలు దృష్టి సారించడంతో జిల్లాలో లోక్‌సభ ఎన్నికల సందడి ప్రారంభమైంది. అధికార యంత్రాంగం కూడా ఇప్పటికే ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటనతో పాటు ఎన్నికల ముందు నిర్వహించే బదిలీ ప్రక్రియ పూర్తి చేశారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

కాంగ్రెస్ నుంచి జిల్లాలో లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. కాంగ్రెస్ నుంచి ఖమ్మం స్థానానికి డిమాండ్ అధికంగా ఉండడంతో రాష్ట్ర నేతలంతా ఖమ్మంపైనే దృష్టి సారించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్‌కు 2.70లక్షల ఓట్ల మెజారిటీ లభించింది. దాంతో ఖమ్మం స్థానంలో కాంగ్రెస్‌నుంచి పోటీ చేస్తే విజయం ఖాయమన్న నమ్మకంతో నాయకులు ఎవరికివారు ఈ సీటుకోసం పోటీపడుతున్నారు. కొద్ది రోజుల క్రితం వరకు ఖమ్మంనుంచి సోనియాగాంధీ లేదా ప్రియాంకగాంధీ పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అయితే సోనియాగాంధీ రాజ్యసభకు వెళ్లడం, ప్రియాంకగాంధీ రాయబరేలి నుంచి పోటీ చేస్తారనే ప్రచారం నేపథ్యంలో ఖమ్మం టికెట్‌పై పలువురు ఆశలు పెంచుకుంటున్నారు. ఇక ఖమ్మం టికెట్ ఆశించిన కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరికి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఆమె పోటీనుంచి తలగిపోయారు. ఇక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి ప్రస్తుతం ఖమ్మం టికెట్ బరిలో ఉన్నారు. ఈ క్రమంలో ఎవరికివారు తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. మరోవైపు ఈ ముగ్గురికి కాకుండా ఖమ్మంటికెట్ మరొకరికి ఇస్తారనే ప్రచారం కూడా ఉంది. ఈ నేపథ్యంలోనే రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, జట్టి కుసుమకుమార్ ఖమ్మం టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. దీంతో ఖమ్మం టికెట్ కాంగ్రెస్ అధిష్ఠానానికి పరీక్షగా మారింది. ఇక మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి కేంద్ర మాజీమంత్రి బలరాంనాయక్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోనూ కాంగ్రెస్‌కు భారీ ఆధిక్యత లభించింది. ఈ నేపథ్యంలో అక్కడ కూడా టికెట్‌కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఇక అసెంబ్లీల్లో లభించిన మెజారిటీని పెంచుకునే కాంగ్రెస్ ముందుంది. ముఖ్యంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసెంబ్లీ కంటే ఎక్కువ మెజారిటీ సాధించేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఖమ్మం కార్పొరేషన్‌పై దృష్టి పెట్టారు. ఖమ్మం కార్పొరేషన్‌లో మెజారిటీకి అవసరమైన కార్పొరేటర్లు కాంగ్రెస్ గూటికి చేరబోతున్నారు. అధికారికంగా డీసీసీబీ చైర్మన్ పదవి కూడా త్వరలో కాంగ్రెస్ ఖాతాలో చేరనుంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్ చైర్మన్‌గా ఉన్న దొండపాటి వెంకటేశ్వరరావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. త్వరలో ఆయన కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది. గతంలో టీడీపీలో పనిచేసి ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న కొందరు ముఖ్యులు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తిచూపుతున్నారు. అయితే స్థానిక పరిస్థితులను విశ్లేషించిన తరువాతనే చేరికలపై నిర్ణయం తీసుకోనున్నారు. స్థానిక కేడర్ అంగీకరిస్తే బీఆర్ఎస్‌లోని టీడీపీ మాజీ నేతలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది.

బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరో..?

ఇక బీఆర్ఎస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిగా గతంలో నామ నాగేశ్వరరావు పేరు దాదాపు ఖరారైందనే ప్రచారం జరిగింది. సత్తుపల్లి సభలో పార్టీ అధినేత కేసీఆర్ ముందుగానే నామ పేరు ప్రకటించారు. ఆ తర్వాత ఎన్నికల ఓటమి అనంతరం ఖమ్మంలోక్‌సభ నియోజకవర్గ సమీక్షలో కూడా జిల్లా నేతలంతా ఏకగ్రీవంగా నామా పేరు ప్రతిపాదించారు. అయితే ఆ పార్టీ ఇంకా అధికారికంగా ఆయన పేరును ప్రకటించలేదు. ప్రస్తుతానికి బీఆర్ఎస్ నుంచి ఖమ్మం ఎంపీ స్థానానికి నామా నాగేశ్వరరావు పేరు మాత్రమే వినిపిస్తుండగా ఆయన పోటీలో ఉంటారా లేదా అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఒక వేళ నామా పోటీ లేకుంటే ప్రత్యామ్నాయంగా ఎవరిని ఇక్కడినుంచి బరిలో దింపుతారనేదానిపై ఇంకా ఆ పార్టీ నుంచి స్పష్టత లేదు. మహబూబాబాద్ లోక్‌సభ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మాలోతు కవిత మళ్లీ పోటీచేసే అవకాశం ఉంది.

లోక్‌సభపై బీజేపీ ఆశలు..

బీజేపీ కూడా ఖమ్మం, మహబాద్ లోక్‌సభ నియోజకవర్గాలపై దృష్టిసారించింది. ఆ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో నామమాత్రంగానే ఓట్లు లభించినా మోదీ ప్రభావంతో లోక్‌సభ ఎన్నికల్లో భారీగా ఓట్లు లభిస్తాయని ఆ పార్టీ భావిస్తోంది. ఎన్నికల ప్రచారంలోనూ ఆ పార్టీ దూకుడుగానే వెళుతోంది. అందులో భాగంగానే భద్రాచలం నుంచి ఈయాత్రకు శ్రీకారం చుట్టబోతున్నారు. భద్రాచలంలో మొదలయ్యే ఈయాత్ర ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ నియోజకవర్గాల్లో కొనసాగనుంది. ఇక బీజేపీ నుంచి ఖమ్మం టికెట్ ఆశిస్తున్న వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, దేవకి వాసుదేవరావు, తాండ్ర వినోదరావు గంటేల విద్యాసాగర్ తదితరులు ఉన్నారు. ఇలా ప్రధాన పార్టీలు ఎవరికి వారు ఎన్నికల కసరత్తు ప్రారంభించడంతో జిల్లాలో రాజకీయ వేడి పెరుగుతోంది.

ఖమ్మానికి స్వామినారాయణ్ గురుకులం

- ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు సన్నాహాలు
- రఘునాథపాలెం వద్ద స్థలం పరిశీలన
- మంత్రి తుమ్మలను కలిసిన సంస్థ ప్రతినిధులు



మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందిస్తున్న స్వామినారాయణ్ గురుకుల ట్రస్టు ప్రతినిధులు

ఖమ్మం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం జిల్లా కేంద్రానికి శ్రీ స్వామినారాయణ్ గురుకుల ఇంటర్నేషనల్ స్కూల్ రాబోతోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో సీబీఎస్ఈ సిలబస్‌తో ఈ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు కార్యచరణ సిద్ధమవుతోంది. ఆ సంస్థ ప్రతినిధులు ఇప్పటికే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి స్కూల్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వినతిపత్రం అందించారు. ఇప్పటికే ఈ స్కూల్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని రఘునాథపాలెం సమీపంలో గుర్తించారు. ఆ స్థలాన్ని సంస్థ ప్రతినిధులు ఇటీవల పరిశీలించి వెళ్లారు. రైల్వే, రోడ్డు రవాణా సదుపాయాలు ఉన్నందున రఘునాథపాలెం సమీపంలో ఈ స్కూల్ ఏర్పాటుకు నిర్ణయించారు. మంత్రి తుమ్మల కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ స్కూల్ ఏర్పాటు ఆవశ్యకతను



గుర్తించి స్కూల్‌కు అవసరమైన స్థలాన్ని ప్రతిపాదించి ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. దీంతో 15 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఈ మేరకు ప్రతిపాదనలు కూడా ప్రభుత్వానికి వెళ్లబోతున్నాయి. 1నుంచి 12తరగతి వరకు ఈ విద్యాలయంలో బోధించనున్నారు.

ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలతో కూడిన విద్య

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్వామినారాయన్ గురుకులానికి దేశ వ్యాప్తంగా 58బ్రాంచ్‌లు ఉన్నాయి. హైదరాబాదు, బెంగళూరు, ముంబాయి, నాగపూర్, ఢిల్లీ, రాయపూర్, విజయవాడ, విశాఖపట్నం, మైసూర్, అహ్మదాబాద్, సూరత్ తదితర పట్టణాల్లో ఈ ఇంటర్‌నేషన్ స్కూల్ బ్రాంచ్‌లు ఉన్నాయి. దేశంలోనే కాకుండా అమెరికా, యుకే, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోనూ ఈ స్కూల్ బ్రాంచ్‌లు ఉన్నాయి. వేలాది మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. విద్యా, సద్విద్య, బ్రహ్మవిద్య మూడు అంశాలు ప్రాధాన్యంగా మోడ్రన్, ట్రెడిషనల్, స్పిరుచ్యువల్ ఎడ్యుకేషన్ ద్వారా విద్యాబోధన చేయనున్నారు.అంతర్జాతీయ ప్రమాణాలతో నడిచే ఈ విద్యాసంస్థను ఖమ్మంలో ఏర్పాటు చేస్తే ద్వారా ఈ ప్రాంతంలో ఉన్నత, ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ వికాసంతో కూడిన విద్య అందుబాటులోకి రానుంది. సంస్కృతి సంప్రదాయాలు, విలువతో కూడిన విద్యాబోధనతో ఇక్కడ చదివే విద్యార్థులు సంపూర్ణ వ్యక్తిత్వాన్ని పొందుతారు. శ్రీ స్వామినారాయణ్ గురుకుల ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు సాధు సుఖవల్లభ్‌దాస్ తదితరులు ఇటీవల మంత్రి తుమ్మలను కలిసి స్కూల్ ఏర్పాటుకు వినతిపత్రం అందించడంతో పాటు రఘునాథపాలెం సమీపంలో స్థలాన్ని గుర్తించారు.

నిపుణులైన అధ్యాపకులు, విశాలమైన తరగతి గదులు, అన్ని రకాల ల్యాబ్‌లు, విద్యార్థులకు అవసరమైన వసతిగృహాలతో పరిపూర్ణమైన విద్యనందిడచంలో ప్రపంచంలోనే శ్రీస్వామినారాయణ్ గురుకుల ఇంటర్నేషనల్ విద్యా సంస్థలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. లాభాపేక్ష లేకుండా సేవాభావంతో ఫీజులు నిర్ణయించి మెరుగైన విద్యాబోధనకు ఈవిద్యా సంస్థ కృషి చేస్తోంది. ఖమ్మంలో ఈ విద్యాసంస్థ ఏర్పడితే ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువతో కూడిన విద్య అందుబాటులోకి రానుంది.

వదల బొమ్మాళీ..

బదిలీ అయినా డిప్యూటేషన్‌పై ఐదేళ్లుగా అదే స్థానంలో కొనసాగింపు

- ఐసీడీఎస్‌లో ఓ అధికారి వసూళ్ల దందా
- విచారణ నిర్వహించిన సంక్షేమాధికారి
- తప్పని తేలితే చర్యలు తప్పవని వెల్లడి

7

రాజకీయ జోక్యంతో కుప్పకూలుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థలు

- అలస్యమవుతున్న కోర్టు తీర్పులు
- అవినీతి లేని సమాజానికి న్యాయవాదులు ముందుండాలి
- ఐఏఎల్ మహాసభలో జస్టిస్ చంద్రకుమార్ పిలుపు
- ఖమ్మంలో సంఘం 9వ మహాసభలు



అక్రమంగా ఇంటి నిర్మాణం

- మాజీ పోలీసు అధికారి సుభాష్‌చంద్రబోసుపై కేసు నమోదు
- ఫిర్యాదు చేసిన ఖమ్మం మునిసిపల్ కమిషనర్

6

భద్రాద్రిలో వైభవంగా సహస్ర కలశాభిషేకం



నేడు నిత్యకల్యాణాల పునరుద్ధరణ

భద్రాచలం, ఫిబ్రవరి 24: భద్రాద్రి దేవస్థానంలో శనివారం శ్రీ సీతారామచంద్రస్వామికి పంచామృతాలతో వైభవంగా సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా ఉత్సవమూర్తులకు మంజరి అద్ది గోదావరి జలాలతో అభిషేకం నిర్వహించారు. పంచామృతాలతో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారిని అందంగా అలంకరించి ప్రత్యేకపూజలు, ప్రసాద నివేదన చేశారు. మూడు రోజుల పాటు సాగిన సహస్ర కలశాభిషేక మహోత్సవాలు శనివారంతో ముగియడంతో ఆదివారం ఆలయంలో నిర్వహించే నిత్య కల్యాణాలు పునరుద్ధరిస్తారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, కోటి శ్రీమన్నారాయణాచార్యులు, ముఖ్య అర్చకులు అమరవాది మధుసూదనాచార్యులు, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రంగనాయకస్వామి కల్యాణం

భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో రంగనాయకస్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక రంగనాయకుల గుట్టపై వేంచేసి ఉన్న శ్రీదేవి-భూదేవి సమేత రంగనాయకస్వామికి ధ్యాన మందిరంలో కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా కల్యాణ సామగ్రిని భద్రాద్రి దేవస్థానం తరఫున రామాలయం నుంచి మేళతాళాలతో ధ్యాన మందిరానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకస్వాములు కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం తరఫున కల్యాణ మూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

సిరులవేణికి సౌర వెలుగులు

- ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తిలో సింగరేణి ముందడుగు
- వచ్చే మూడేళ్లలో 450మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి
- ఇప్పటికే అన్ని ఏరియాల్లో ప్లాంట్‌ల నిర్మాణాలు

కొత్తగూడెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తిలో సరికొత్త రికార్డులు నమోదు చేస్తూ దేశవ్యాప్తంగా పలు సంస్థలకు బొగ్గు సరఫరా చేస్తూ అవార్డులు, రివార్డులు పొందుతున్న సింగరేణి సోలార్ విద్యుత్ రంగంలోనూ వేగంగా అభివృద్ధిని సాధిస్తోంది. ఇప్పటికే థర్మల్ విద్యుత్ రంగంలో విజయకేతనం ఎగురవేసిన సంస్థ ప్రస్తుతం సోలార్ విద్యుత్‌పై దృష్టిసారించింది. త్వరలో పవన విద్యుత్ రంగంవైపు అడుగులు వేయనుంది. ప్రస్తుతం సింగరేణి వ్యాప్తంగా 11ఏరియాలో ఉన్న బొగ్గు బావులు, డిపార్టుమెంట్లు ఇతర అవసరాల కోసం సంస్థ ఏటా 700మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తోంది. ఈ నేపథ్యంలో విద్యుత్‌భారాన్ని తగ్గించుకునేందుకు సింగరేణి ఇప్పటికే సోలార్ వైపు అడుగుపెట్టి 524మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే కొన్ని ప్లాంట్లను ప్రారంభించింది. 2018లో ఎనిమిది ఏరియాల్లో 14ప్లాంట్లను ప్రారంభించింది. మొదటి దశలో 300మెగావాట్ల సోలార్‌విద్యుదుత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే 9ప్లాంట్‌ల ద్వారా 224మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. రెండో దశలోనూ 232మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని కలిపి అక్టోబర్ వరకు మొత్తం 532మెగావాట్ల సోలార్ విద్యుత్ సాధించేందుకు సిద్ధమవుతోంది. ఇది సాధిస్తే సింగరేణి రూ.కోట్ల విద్యుత్ ఖర్చును ఆదా చేయనుంది. సింగరేణి వ్యాప్తంగా కొతగూడెం, ఏరియాలో 37మెగావాట్లు, ఇల్లెందు ఏరియాలో 39మెగావాట్లు, మణుగూరు ఏరియాలో 30, రామగుండం-3 ఏరియాలో 50, మందమర్రి-2లో 15, మందమర్రి-1 ఏరియాలో 28, భూపాలపెల్లి ఏరియాలో 10, ఎస్టీపీపీలో 15 మెగావాట్లు, మొత్తం 224మెగావాట్ల ఉత్పత్తి చేస్తోంది. దీంతో సుమారు రూ.500కోట్లు ఆదా అవుతోంది.

కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాలతో

సింగరేణి సంస్థలో చేపడుతున్న సోలార్, థర్మల్ విద్యుత్‌ప్లాంట్‌లను ఇటీవల కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి పరిశీలించారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ సోలార్, థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ల గురించి వివరించారు. దీంతో మరికొద్ది రోజుల్లో మళ్లీ సింగరేణి సంస్థలో పర్యటిస్తానని, సంస్థ సోలార్ ప్లాంట్లను పెంచడమే కాకుండా వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి ఏడాదికి సింగరేణి సంస్థ కనీసం 700మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టాలని ఆయన సీఎండీకి సూచించారు. కాగా సోలార్ విద్యుత్‌తో సంస్థకు ఏడాదికి రూ.200 కోట్ల మిగులు కనిపిస్తోంది. విండ్‌పవర్ ద్వారా 1,000మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తిచేయాలనే ఆలోచనలో ఉంది. ఈ నేపథ్యంలో సింగరేణి అధికారులు రాజస్థాన్ వెళ్లి పవనవిద్యుత్‌పై చర్చించి అవగాహన పొందారు. రాష్ట్రంలో మహబూబ్‌నగర్ పరిధిలో ఉన్న సానుకూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అక్కడ పవన విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించనున్నారు.

గూడెంలో నేడు సోలార్ ప్లాంట్ ప్రారంభం

ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క



ఆంధ్రజ్యోతి కొత్తగూడెం: సింగరేణి యాజమాన్యం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం ఏరియాలో నిర్మించిన సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఆదివారం డిప్యూటీ సీఎం మల్లుబట్టి విక్రమార్క ప్రారంభించనున్నారు. కొత్తగూడెం ఏరియాలోని రామవరం ప్రాంతంలో 10.5మేగావాట్ల రూ.56.76కోట్ల వ్యయంతో ఈ ప్లాంట్‌ను నిర్మించారు. ఆదివారం సాయంత్రం 5.30గంటలకు డిప్యూటీ సీఎంట ఈ సోలార్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. ఈ మేరకు సింగరేణి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో విద్యుత్ కోతలు ఉండవు

- ఫిర్యాదులకోసం టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు
- భద్రాద్రి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ రమేష్

కొత్తగూడెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని భద్రాద్రి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ కె. రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా విద్యుత్ సరఫరాకు, ఇతరత్రా సమస్యలకు సంబంధించి కొత్తగూడెంలోని జిల్లా విద్యుత్ కార్యాలయంలో 24/7 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటూ కంట్రోల్ రూంలోని 7901628365 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు

విద్యావంతుల ఓట్లివే..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ముసాయిదా ఓటరు జాబితా విడుదల
- ఖమ్మం జిల్లాలో 76,869 మంది..
- భద్రాద్రిలో 36,926మంది ఓటుహక్కు నమోదు
- అభ్యంతరాల స్వీకరణకు మార్చి 14వరకు గడువు



రాజకీయ ప్రతినిధులతో సమీక్షిస్తున్న ఖమ్మం అదనపు కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 24: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితాను శనివారం ఇరు జిల్లాల అధికారులు విడుదల చేశారు. ఈ జాబితాల ప్రకారం ఇరు జిల్లాల్లో ఇప్పటివరకు 1,13,795మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో అదనపుకలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ ముసాయిదా ఓటర్ జాబితాను విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం ఖమ్మం జిల్లాలో మొత్తం 76,869 మంది పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. వారితో పురుషులు 46,556, స్త్రీలు 30,309 ఇతరులు 4 ఉన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శనకు ఉంచారు. అభ్యంతరాలు తెలియజేయటానికి మార్చి 14 వరకు గడువు ఉందని అదనపు కలెక్టర్ తెలిపారు. తుది ఓటర్ల జాబితాను ఏప్రిల్ 4న ప్రకటించనున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై అదనపు కలెక్టర్ శనివారం తన ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అర్హత కలిగి ఉండి ఇంకా ఓటరుగా నమోదు కాని పట్టభద్రులు మార్చి 14 వరకు ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రచురించిన ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫారం-7 లేదా ఫారం-8 ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు.

భద్రాద్రి జిల్లాలో 36,926మంది ఓటర్లు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 36,926మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. ఈ మేరకు శనివారం ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 36,926 మంది పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకున్నారని తెలిపారు. అందులో పురుషులు 20,900 మంది కాగా స్త్రీలు 16,026 ఉన్నారని తెలిపారు. జిల్లాలో 29 ప్రదేశాల్లో 55 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే మార్చి 14వ తేదీ వరకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు సమర్పిస్తున్న భక్తులు





ఆర్టీసీ బస్సుల్లో తిరుగు ప్రయాణమైన భక్తులు



ఆర్టీసీ ప్రాంగణానికి వెళ్తున్న భక్తులు



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరించి తల్లులకు మొక్కుతున్న భక్తులు

చివరి రోజూ.. అదే జోరు..

- చివరిరోజూ మేడారానికి పోటెత్తిన భక్తులు
- తల్లులను దర్శించుకున్న స్పీకర్
- ప్రశాంతంగా దేవతల వనప్రవేశం
- ముగిసిన నాలుగు రోజుల జాతర
- ఊపిరి పీల్చుకున్న అధికారులు



చిన్నారికి జంపన్న జలాలతో పుణ్యస్నానం..



తిరుగుప్రయాణంలో బై బై చెప్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరకు చివరి రోజు కూడా భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చారు. శనివారం సాయంత్రం తల్లులు వన ప్రవేశం చేయనుండడంతో వనదేవతలను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి, అదేవిధంగా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు భారీ ఎత్తున చేరుకున్నారు. దీంతో క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. గద్దెల ప్రాంగణం ఇసుకవేస్తే రాలనంతగా భక్తులతో కిక్కిరిసిపోయింది.



తల్లుల వనప్రవేశం

తల్లుల వనప్రవేశం ప్రశాంతంగా జరిగింది. శనివారం సాయంత్రం 5 గంటలకు సమ్మక్కను ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య చిలుకలగుట్టకు, సారలమ్మను కాక సారయ్య కన్నెపెల్లికి, అలాగే గోవిందరాజులను కొండాయి, పగిడిద్దరాజును పూనుగొండ్లకు తరలించారు. దీంతో మేడారం మహాజాతర ముగిసింది.

ప్రముఖుల రాక

మేడారానికి శనివారం కూడా ప్రముఖుల తాకిడి కొనసాగింది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సమ్మక్క, సారలమ్మను దర్శించి మొక్కులు చెల్లించారు. హెలిక్యాప్టర్ ద్వారా మేడారానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ స్వాగతం పలికారు. స్పీకర్ తొలుత తులాభారం ద్వారా ఎత్తుబంగారాన్ని సమర్పించారు. అనంతరం తల్లుల గద్దెల వద్దకు వెళ్లి పూజలు చేశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ సైతం వనదేవతలను దర్శించుకున్నారు.

ధన్యవాదాలు తెలిపిన సీతక్క

జాతరను విజయవంతం చేయడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, వివిధ శాఖల అధికారులకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. జాతర ముగింపు సందర్భంగా శనివారం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. జాతర నిర్వహణకు అత్యధిక నిధులు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్, ఎస్పీ, ఇతరశాఖల అధికారులను అభినందించారు.

సంప్రదాయ ఊరేగింపు

సమ్మక్క, సారలమ్మ జాతర ముగుస్తుండడంతో చివరి రోజు శనివారం మేడారంలో ఆదివాసీలు సంప్రదాయ ఊరేగింపు నిర్వహించారు. వివిధ కోయ జాతుల వారు సుమారు 300 మంది సంప్రదాయ దుస్తులు ధరించి ఉదయం సమ్మక్క గద్దెల వద్దకు చేరుకున్నారు. ఆదివాసీ పద్ధతిలో పూజలు చేశారు. అక్కడి నుంచి డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, కొమ్ముబూరలతో సంప్రదాయ నృత్యం చేస్తూ ముందుకు సాగారు. శివసత్తులు పూనకాలతో శిగాలూగారు.

ముగిసిన మహాజాతర

అంగరంగ వైభవంగా సాగిన మేడారం మహాజాతర శనివారం ముగిసింది. నలుగురు దేవతల వనప్రవేశంతో నాలుగు రోజుల సంరంభానికి తెరపడింది. భక్తులు తిరుగుబాట పట్టడంతో మేడారంలో గుడారాలన్నీ ఖాళీ అయ్యాయి. జన ఘోషతో హోరెత్తిన జాతర ప్రాంతం తిరిగి నిశ్శబ్దం ఒడిలోకి జారిపోయింది. 'రెండేళ్లకు మళ్లీ వస్తాం తల్లీ.. కరుణించు' అంటూ మొక్కుకుంటూ భావోద్వేగంతో స్వగ్రామాల బాట పట్టారు.



మేడారం వెళ్లే రహదారిపై బారులుదీరిన వాహనాలు

అక్రమంగా ఇంటి నిర్మాణం

- మాజీ పోలీసు అధికారి బోసుపై కేసు నమోదు
- ఫిర్యాదు చేసిన ఖమ్మం మునిసిపల్ కమిషనర్

ఖమ్మం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): అక్రమ ఇంటి నిర్మాణం విషయంలో మాజీ పోలీసు అధికారి సుభాష్ చంద్రబోస్, ఆయన కుటుంబ సభ్యులతో పాటుగా మరో ఇద్దరిపై ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఖమ్మం నగర పరిధిలోని ఓ ప్రాంతంలో ఆయన కుమారుడి పేరుమీద ఇంటి నిర్మాణం కోసం టీఎస్ బీపాస్‌లో దరఖాస్తు చేయగా, దరఖాస్తులో పేర్కొన్న విధంగా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాన్ని చేపట్టారంటూ మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. దరఖాస్తుదారుడు టీఎస్ బీపాస్‌లో గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు మరో ఫ్లోరును మాత్రమే నిర్మించేందుకు అనుమతి పొందగా నిబంధనలు ఉల్లంఘించి గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటుగా మరో రెండు అంతస్థులను నిర్మించారనీ, దాంతో పాటు సెట్‌బ్యాక్‌లను కూడా అనుసరించలేదని కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఈ విషయంపై కార్పొరేషన్ నుంచి నోటీసులు జారీ చేసినా అనధికారిక నిర్మాణాన్ని కొనసాగించినట్లు అందులో తెలిపారు. కాగా భవన నిర్మాణ అనుమతుల కోసం తక్కువ మొత్తం చెల్లించేందుకు మునిసిపల్ అధికారులను మోసం చేసి అనుమతి పొందారంటూ కమిషనర్ ఆదర్శ్ సురభి పేరు మీద వచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం ఖానాపురం హవేలిస్టేషన్‌లో మాజీ పోలీసు అధికారి సుభాష్ చంద్రబోస్‌తో పాటు ఆయన భార్య, కుమారుడు, బిల్డర్ రాధాకృష్ణ, లైసెన్స్ పొందిన టెక్నికల్ వ్యక్తి షేక్ సోయబ్‌లపై సెక్షన్ 420 కింద కేసు నమోదు చేశారు.

ప్రభుత్వానికి విరాళంగా రూ.20వేల పింఛన్ అందజేత



మాట్లాడుతున్న జాఫర్

ఖమ్మం చర్చికాంపౌండ్, ఫిబ్రవరి24: సంక్షేమ పథకాల అమల్లో నేను సైతం అనే దృక్పథంతో తనకు వచ్చే ఫిబ్రవరి నెల పింఛన్ మొత్తం రూ.20వేలను ఖమ్మం కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విరాళంగా ఇవ్వనున్నట్టు రిటైర్డు ఏఆర్ పోలీసు కానిస్టేబుల్ గులాం జాఫర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను 1981లో కానిస్టేబుల్‌గా పదవీ విరమణ పొందానన్నాని తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు కోసం తనవంతుగా ఈ నెల పింఛన్‌ను ప్రభుత్వానికి పంపించనున్నట్లు పేర్కొన్నారు. మేధావులు, విద్యావంతులు, డాక్టర్లు తదితరులు రాష్ట్రానికి ఆర్థికసాయం అందించి ఖమ్మంజిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు.ఈ సమావేశంలో సయ్యద్ సలీం పాల్గొన్నారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 24: సింగరేణి మండలం, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నిందితుడు పిట్టల వెంకటేశ్వర్లుకు ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ. పదివేల జరిమానా విధిస్తూ ఖమ్మం అదనపు అసిస్టెంట్ సెషన్స్‌కోర్టు న్యాయాధికారి కె.ఆశారాణి శనివారం తీర్పు వెల్లడించారని పోలీసులు తెలిపారు.

సీఎం రేంత్‌రెడ్డిని కలిసిన టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతిప్రతినిధి): తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్రం సంఘం రాష్ట్ర అధ్యక్షుడి గా ఎన్నికైన జిల్లాకు చెందిన ఏలూరి శ్రీనివాసరావుతో పాటు రాష్ట్ర కమిటీ శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఉద్యోగుల సమస్యలను ఈసందర్భంగా టీజీవో సంఘం తరుపున ఏలూరి శ్రీనివాసరావు ముఖ్యమంత్రికి వివరించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే పెండింగ్‌లోని డీఏలు, ఈకుబేర్‌లోని బిల్లులు ఏరియర్స్‌ను విడుదల చేయాలని, మెరుగైన పీఆర్సీని ప్రకటించాలని 317 జీవో సమస్యను పరిష్కరించాలని తదితర డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పథకాలను ప్రజలకు సక్రమంగా అందించేందుకు రాష్ట్ర గెజిటెడ్ అధికారులతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల నుంచి పూర్తి సహకారం అందిస్తామని, ఆరు గ్యారంటీలను విజయవంతంగా అమలయ్యేలా సంఘం తరుపున సహకరిస్తామని ముఖ్యమంత్రికి తెలిపారు. 317జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయడానికి క్యాబినేట్ సబ్ కమిటీ వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇటీవల రాజ్యసభ సభ్యురాలి ఎన్నకైన రేణుకాచౌదరిని కలిశారు.

నకిలీ బంగారంతో బురిడీ

- రూ.5 లక్షలు నష్టపోయిన బాధితులు

చింతకాని, ఫిబ్రవరి 23: బంగారం ఆశ చూపి అమాయకుల నుంచి రూ.5 లక్షలు కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాతులు కాస్తూ బతుకుదెరువు కోసం వచ్చిన ఓ వ్యక్తి చెప్పిన మాయమాటలు నమ్మి మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 4గురు వ్యక్తులు రూ. 5 లక్షలు నష్టపోయారు... బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..ఓ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు మధ్య వర్తి చెప్పిన మాటలు విని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి వచ్చిన ఫోన్ కాల్‌తో అక్కడికి వెళ్లారు. రాయచోటి చేరుకున్న నలుగురు వ్యక్తులను ఓ ముఠా కలసి తాము రోజు వారి కూలీలమని పరిచయం చేసుకున్నారు. ఇటీవల తాము ఇంటి పనికి సంబంధించి మట్టి తవ్వకాలు చేస్తుండగా బంగారంతో నిండిన కుండలు బయట పడ్డాయని, అందులో రెండు కేజీల పాత బంగారు నాణాలు, గుండ్లు ఉన్నయని నమ్మబలికారు. ముఠా సభ్యులు బాధితులను నమ్మించేందుకు మొదట గ్రాము బంగారు గుండ్లను ఇచ్చి పరీక్షించుకోవాల్సిందిగా సూచించారు. ముఠా సభ్యులు మాటలను నమ్మిన నలుగురు వ్యక్తులు వారిచ్చిన గ్రాము బంగారు గుండ్లను తమతో ఖమ్మం తీసుకొచ్చి గాంధీ చౌక్‌లోని ఓ బంగారు నగల దుకాణంలో పరీక్షించగా, నిజమైన బంగారంగా గుర్తించడంతో సంబరపోయారు.

రెండు రోజుల అనంతరం.. ముఠా సభ్యుల నుంచి బాధితులకు ఫోన్ వచ్చింది. అసలు బంగారంగా నిర్ధారణ జరిగిందా అని ప్రశ్నించి, బాధితులతో మిగిలింది మొత్తం బంగారమేనని నమ్మకం కలిగేలా మాట్లాడారు. డబ్బు అత్యవసరమని తమ వద్ద ఉన్న రెండు కేజీల బంగారం అమ్ముతామని, కేవలం రూ.5 లక్షలు ఇస్తే మొత్తం బంగారం అప్పజెప్పుతామని నమ్మబలికారు. దీంతో నలుగురు వ్యక్తులు తక్కువ ధరకు తమకు బంగారం వస్తుందని ఆశతో 5 లక్షలు చెల్లించి బంగారం కొనేందుక నిశ్చయించుకున్నారు. నలుగురు సభ్యుల్లో ఇద్దరు వ్యక్తులు గ్రామంలో తెలిసిన వారి వద్ద అప్పు చేసి రూ.5 లక్షలు సమకూర్చుకుని రాయచోటి వెళ్లారు. ఈ సారి మొదట మాట్లాడిన ప్రాంతానికి కాకుండా వేరే ఓ నిర్మానుష్య ప్రాంతానికి రమ్మని చెప్పడంతో నలుగురు వ్యక్తులు ముఠా చెప్పిన ప్రాంతానికి వెళ్లారు. కొద్ది సమయం ఎదురు చూసిన అనంతరం 6 మంది ఉన్న ముఠా సభ్యులు వచ్చి బంగారం దాచిన సంచి ఇచ్చి వారి వద్ద నుంచి డబ్బులు తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. తమకు తక్కువ ధరకు బంగారం లభించిందన్న ఆనందంతో నలుగురు వ్యక్తులు ముఠా సభ్యులు ఇచ్చిన సంచిని తీసుకుని ఖమ్మం చేరుకున్నారు. మరునాడు అందులో కొంత బంగారాన్ని ఖమ్మం తీసుకెళ్లి పరీక్షించగా నకిలీ బంగారమని తేలడంతో తాము మోసపోయామని గ్రహించారు. ఈ విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని విషయం బయటకు పొక్కకుండా గోప్యత పాటించారు. అయితే ఘటనపై నేటి వరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదు. ఇలా మాయగాళ్ల ఉచ్చులో పడి మోసపోతున్న అమాయకులు అప్రమత్తంగా ఉండాలని, అనామకుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మొద్దని పోలీసులు సూచిస్తున్న ఇలాంటి ఘటనలు పునారావృతం అవుతూనే ఉన్నాయి.

వైరా శిఖం భూముల్లో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

వైరా, ఫిబ్రవరి 24: వైరా శిఖం భూముల్లోని ఆక్రమణలను ఉద్రిక్తతల మధ్య శనివారం తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తొలగింపు ప్రక్రియ చేపట్టారు. వైరా మునిసిపాలిటీ 2వ వార్డులోని హనుమాన్‌బజార్, మూడోవార్డులోని సంతబజార్‌కు చెందిన అనేకమంది తమ సమీపంలోని రిజర్వాయర్ శిఖం భూములను పోటాపోటీగా ఆక్రమించుకొని గుడారాలు వేశారు. రెవెన్యూ అధికారులు శిఖం భూమిని ఆక్రమించిన వారితో మాట్లాడి ఖాళీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇండ్లస్థలాలు లేని పేదలుంటే వారి వివరాలను తమ ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. శిఖం భూముల్లోని ఆక్రమణలను ఖాళీ చేయాలని స్పష్టం చేస్తూ రెండురోజుల సమయం ఇచ్చారు. అయినప్పటికీ వారు ఆక్రమణలు ఖాళీ చేయక పోవడంతో మునిసిపల్‌కు చెందిన ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లతో రెవెన్యూ, పోలీసులు, మునిసిపల్ సిబ్బంది చేరుకొని ఆక్రమణల తొలగింపునకు పూనుకోగా, ఆక్రమణదారులు అడ్డుకున్నారు. ఉద్రికత్తలో ఒక మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. కొంత మంది యువకులు ఆత్మహత్య చేసుకుంటా మని బెదిరింపులకు దిగారు. అయినప్పటికీ అధికారులు ఆక్రమణల తొలగింపు ప్రక్రియను కొనసాగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

అటెండరే అధికారి

- తూనికలు, కొలతల కార్యాలయం ఉద్యోగులకు మేడారం విధులు



ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న తూనికలు, కొలతల కార్యాలయం

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 24: నిత్యవసరాల నుంచి అత్యవసరాల వరకు పూలు, పండ్లు నుంచి స్వీట్లు వరకు, పిల్లలు తినే ఐస్ క్రీమ్ నుంచి పెద్దలు వాడే ఔషధాల వరకు కాలు బయట పెట్టి రోడ్డెక్కితే చాలు ప్రతి చోట తప్పుడు తూనికలు, కొలతలతో ప్రతి క్షణం ప్రజలు మోసపోతూనే ఉన్నారు. ఎంతో కీలకమైన జిల్లా తూనికలు కొలతలశాఖకు ఐదేళ్లుగా గ్రహణం పట్టింది. జిల్లాలో పూర్తి స్థాయిలో అధికారులు లేక పోవడంతో పక్క జిల్లాల అధికారులే ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తూ ప్రభుత్వ నివేదికలు, సభలు, సమావేశాలకు మాత్రమే హాజరవుతున్నారు. క్షేత్ర స్థాయిలో ఉన్న ఇద్దరు ఉద్యోగులు మాత్రం ప్రభుత్వ లెక్కల కోసం ఒకటి రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇదిలా ఉంటే మేడారం జాతర సందర్భంగా జిల్లా తూనికలు కొలతల కార్యాలయంలోని అందరి ఉద్యోగులకు ఉన్నతాధికారులు మేడారం విధులు కేటాయించారు. దీంతో అటెండరే అధికారిగా మారారు. రోజు ఉదయం వచ్చి తాళం తీయటం సాయంత్రం వరకు కార్యాలయంలో కూర్చొని వెళ్తున్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులో ఖమ్మం విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 24: రాష్ట్ర వ్యాప్తంగా సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం ఆన్‌లైన్లో సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను పాత డీఈవో కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆన్‌లైన్ టాలెంట్ టెస్టులో 128 విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాల నేలకొండపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ 9వ తరగతి విద్యార్థి గ్రీష్మా, ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఎస్‌వీఎస్ శివానంద్, జడ్పీహెచ్ఎస్ జెల్లేపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి మనీష్‌కుమార్, జడ్పీహెచ్ఎస్ వేంసూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి బాలమణికంఠలు ప్రతిభ చూపినట్లు తెలిపారు. టెస్టును పెసర ప్రభాకర్‌రెడ్డి, ఎనుముల వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

రాజకీయ జోక్యంతో కుప్పకూలుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థలు: జస్టిస్ చంద్రకుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ చంద్రకుమార్

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 24: పాలకవర్గాలు, రాజకీయ నాయకుల జోక్యంతో ప్రజాస్వామ్య వ్యవస్థలు కుప్పకూలుతున్నాయని జస్టిస్ చంద్రకుమార్ తెలిపారు. అవినీతి లేని సమాజం కోసం న్యాయవాదులు ముందుండాలని పిలుపునిచ్చారు. న్యాయవ్యవస్థ సమర్థవంతంగా నిజాయితీగా పనిచేసినప్పుడు ప్రజాస్వామ్యం పరిడవిల్లుతుందని, లేదంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. ఖమ్మంలోని డీపీఆర్సీ భవనంలో శనివారం ఐఏఎల్ (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్) ఉమ్మడి ఖమ్మం జిల్లా 9వ మహాసభను నిర్వహించారు. మేకల భాస్కర్‌రావు ప్రాంగణంలో నిర్వహించిన ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన చండీఘడ్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలపై పలు వాఖ్యలు చేశారు. న్యాయ మూర్తులు పదవీ విరమణ చేసిన వెంటనే రాజ్యసభ సభ్యులుగా, గవర్నర్లుగా నియమించటం ద్వారా తీర్పులపై పలు అనుమానాలు తావిచ్చినట్లువుతుందన్నారు. కొత్తగూడెం జిల్లా సెషన్స్ జడ్జ్ పాటిల్ వసంత్ మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయ వ్యవస్థ వృత్తి సమస్యలపై అవగాహన కల్పించారు. పెమ్మసాని పట్టాబి, ఉదయ్‌భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ఐఏఎల్ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షుడు పోట్ల మాధవరావు ఆవిష్కరించారు. మేకల భాస్కర్ చిత్రపటానికి బొమ్మగాని ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఐఏఎల్ కన్వీనర్ ఓరుగంటి శేషగిరి, దుస్సా జనార్ధన్, శ్రీనివాస్, మాధవరావు, అమర్చంద్, లతీఫ్, శివరామకృష్ణ, నవీన్, రామాంజనేయులు, కొల్లికొండ శరత్బాబు, పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న పీవో ప్రతీక్‌జైన్

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

- ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 24: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలల్లో చదివే బాల బాలికల విద్య బలోపేతానికి ఎస్సీఆర్పీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పర్యవేక్షించాలని ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం తన చాంబర్‌లో మాట్లాడారు. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న గిరిజన బాల బాలికలకు ఇంగ్లీషులో క్లుప్తంగా చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు వచ్చేలా ఎస్సీఆర్పీలు కృషి చేయాలని అన్నారు. ఇంగ్లీషులో ఓట్స్, సెంటెన్స్, పేరాలు తప్పనిసరిగా రాయాలని అన్నారు. ఇంగ్లీషు పదాలు అనర్గళంగా మాట్లాడాలనిఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, ఎస్సీఆర్పీలు రమేష్, బిఖ్య, వెంకట్రత్నం, జయప్రకాష్ పాల్గొన్నారు.

వదల బొమ్మాళీ..

- ఐసీడీఎస్‌లో ఓ అధికారి వసూళ్ల దందా
- విచారణ నిర్వహించిన సంక్షేమాధికారి
- తప్పని తేలితే చర్యలు తప్పవని వెల్లడి

బదిలీ అయినా డిప్యూటేషన్‌పై ఐదేళ్లుగా అదే స్థానంలో కొనసాగింపు

మణుగూరు, ఫిబ్రవరి 24: ఐసీడీఎస్‌లో ఆ అధికారి రూటే సపరేటు'. బదిలీ అయినా కూడా స్థానం మారలేదు. శాఖలోని పెద్దల సహకారంతో డిప్యూటేషన్‌తో ఐదేఏళ్లుగా అక్కడే కొనసాగుతున్నారు. ప్రాజెక్టు పరిధిలోని అన్ని సెక్టర్లలో హవా కొనసాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధం గా తనకంటూ ఓ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఓ ప్రైవేట్ వ్యక్తి, మరో యూనియన్ నాయకుడితో స్త్రీ శిశు సంక్షేమ విభాగంలో కార్యకలాపాలను శాసిస్తున్నారు. కాగా శనివారం ఆంధ్రజ్యోతిలో 'అంగన్‌వాడీల్లో అప్‌గ్రేడ్ దందా' శీర్షికన ప్రచురితమైన కథనం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

మణుగూరు ప్రాజెక్టు పరిధిలోని పినపాక, జానంపేట అనంతారం, కరకగూడెం, రామానుజారం, సమితిసింగారంలో ఉన్న సదరు అధికారి బాధితులు ఏకమవుతున్నారు. అందరూ కలిసి నిలదీయడానికి సిద్ధమవుతున్నారు.

- 8 సెక్టార్లలో వసూళ్ల పర్వం..

ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమాన్ని సజావుగా నిర్వహించాలని బాధ్యతల్ని అప్పగిస్తే సదరు అధికారి వసూళ్ల పర్వానికి తెరలేపారనే విమర్శలు వస్తున్నాయి. ప్రాజెక్టు పరిధిలోని 8 సెక్టార్ల పరిధిలో మినీ అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్ వ్యవహారంలో దాదాపు రూ.50లక్షల దందా నడిచినట్లు సమాచారం.

- సరుకుల కాంట్రాక్టర్‌కు బినామా..

అంగన్‌వాడీలకు బట్వాడా చేసే సరుకుల కాంట్రాక్టులో కూడా ఈ అధికారి బినామీగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ అధికారి పలు సెంటర్లను పరిశీలించేందుకు ఉపయోగించే అద్దె - వాహనం కూడా సొంతానిదే అనే విమర్శలు వస్తున్నాయి.

జిల్లా సంక్షేమాధికారి విచారణ

పినపాక నియోజవర్గంలోని మణుగూరు ప్రాజెక్టు పరిధిలోని అక్రమాలపై జిల్లా సంక్షేమ అధికారి విజేత శనివారం విచారణ నిర్వహించారు. మణుగూరు ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్ వాడీ మినీ సెంటర్ల టీచర్లతో సమావేశమయ్యారు. అప్‌గ్రేడేషన్ విషయంలో ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదని స్పష్టంచేశారు. నిర్భయంగా సమాచారాన్ని మినీ టీచర్లు తమకు తెలియ జేయాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. పనిసమయంలో ఆందోళనలో పాల్గొంటే చర్యలు తప్పవని అన్నారు. అనంతరం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.



విచారణ నిర్వహిస్తున్న జిల్లా సంక్షేమాధికారి విజేత



కేంద్రాన్ని సందర్శించిన జాతీయ బృందం

ఆరోగ్యకేంద్రంలో నాణ్యతా ప్రమాణాల పరిశీలన

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 24: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని మారాయిగూడెం ఆయుష్మాన్ మందిర్ కేంద్రాన్ని జాతీయ ఆరోగ్య వ్యవస్థ వనరుల కేంద్రం(ఎన్‌హెచ్‌ఎస్ఆర్‌సీ) బృంద సభ్యులు శనివారం సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ నాణ్యతా ప్రమాణాల అమలును పరిశీలించారు. బృంద సభ్యులు తొలుత పర్ణశాల రాముడిని దర్శించుకున్నారు. బృందం సభ్యులు డారాజేష్ అరోరా, ప్రహ్లాద్ అంబదాస్ సంజల్, డీఐవో డాబాలాజీనాయక్, డీఎంఓ డాస్పందన, పీహెచ్‌సీ వైద్యాధికారి డాపుల్లారెడ్డి, డీపీఓ దుర్గ, సీహెచ్‌వో నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు భద్రాచలంలో బీజేపీ విజయ సంకల్పయాత్ర

భద్రాచలం, ఫిబ్రవరి 24: లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం భద్రాచలంలో బీజేపీ విజయ సంకల్పయాత్ర నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఉత్తరద్వారం వద్ద విజయసంకల్ప యాత్రలో పాల్గొనే వాహనాలకు ప్రత్యేక వాహన పూజలు నిర్వహించారు. విజయ సంకల్పయాత్రను ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక హెలికాప్టర్‌లో భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాక బీపీఎల్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం ప్రత్యేక వాహనంలో భద్రాద్రి రామయ్యను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విజయసంకల్ప యాత్ర ప్రారంభ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ విజయ సంకల్పయాత్ర మూడు పార్లమెంట్ నియోజకవర్గాల్లోని 22 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వారంరోజుల పాటు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి, విజయ సంకల్ప యాత్ర క్లస్టర్ బాధ్యులు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఇరు జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, రంగా కిరణ్, రాష్ట్ర, జిల్లా నాయకులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఏనుగుల వెంకటరెడ్డి, ముస్కు శ్రీనివాసరెడ్డి, కుంజా ధర్మారావు, ములిశెట్టి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.



విజయసంకల్పయాత్ర వాహనాలకు పూజ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మధ్యతరగతి ప్రజల అభివృద్ధికి ఎస్‌బీఐ తోడ్పాటు

- హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి24: మధ్యతరగతి ప్రజల అభివృద్ధికి ఎస్‌బీఐ తోడ్పాటు అందిస్తుందని హైదారాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ అన్నారు. శనివారం కొత్తగూడెం ఎస్‌బీఐ రీజినల్ కార్యాలయంలో సీఎస్ఆర్ నిధులతో మహిళలకు కుట్టు మిషన్లు, వికలాంగులకు వీల్ చైర్లు అందజేసి మాట్లాడారు. బ్యాంకు యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకుంటే ఇంటి దగ్గరే ఉండి సేవలు, క్యాష్ విత్ డ్రాలు, డిపాజిట్లు, చెక్ ట్రాన్స్ఫర్ ఇంటి దగ్గర నుంచే పొందే అవకాశం కల్పించిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో నివసించే వారికి గృహ రుణ పరిమితిని రూ. ముప్పై లక్షల వరకు పెంచారని, గంటలోనే పర్సనల్ లోన్స్ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ జనరల్ మేనేజర్ వివేక్‌చంద్ర జేశ్వల్, కొత్తగూడెం రీజనల్ మేనేజర్ శ్రీనివాసరామారావు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న సీజీఎం రాజేష్‌కుమార్

బోర్లు పోతున్నాయి.. న్యాయం చేయండి

- అధికారులతో రైతు ప్రవీణ్ వేడుకోలు

భద్రాచలం, ఫిబ్రవరి 24: భద్రాచలం పట్టణ శివారులో మిగులు కరకట్ట నిర్మాణ పనుల్లో తమ బోర్లు పోతున్నాయని రైతు ప్రవీణ్ వాపోయారు. శనివారం తన బోర్లు, పైపులైన్లు తీసేందుకు సంబంధిత సిబ్బంది ప్రయత్నిస్తున్న క్రమంలో వారిని తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ ఇంజనీరింగు ఈఈ రాంప్రసాద్‌తో సదరు రైతు తన గోడు తెలిపారు. 2010లో కరకట్ట నిర్మాణంలో భాగంగా సర్వే చేశారని 2013లో తమ పట్టాభూమిలోని 1.66 ఎకరాలను కరకట్ట కిందకు పోతుందని గుర్తించి ఎకరాకు రూ.3 లక్షల చొప్పున చెల్లించారన్నారు. అందులో అంతకు ముందే ఏర్పాటు చేసిన రెండు బోరు పాయింట్లకు చెల్లింపులు చేయలేదని గతంలోనే అధికారుల దృష్టికి తేగా అప్పటి కాంట్రాక్టర్ ప్రత్యామ్నాయంగా బోరు పాయింట్ ఏర్పాటు వేస్తామని హామీ ఇచ్చారన్నారు. కాని తాజాగా చేపట్టిన కరకట్ట నిర్మాణంతో తమ భూమికి డబ్బులు చెల్లించడం వలన పనులు చేపట్టేందుకు తాము ఏమీ అభ్యంతరం వ్యక్తం చేయడం లేదని, కాకపోతే తమ బోరుపాయింట్లకు పరిహారం చెల్లించాలని అభ్యర్థించారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ ఈఈ రాంప్రసాద్‌ను సంప్రదించగా సంబంధిత రైతు వద్ద ఉన్న ఆధారాలను అందజేస్తే పూర్తిస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.



న్యాయం చేయాలని కోరుతున్న రైతు ప్రవీణ్

దీవించగ రానున్న అమ్మలు..

- అంగరంగ వైభవంగా జరగనున్న సమ్మక్క సారలమ్మ జాతర
- మూడు జిల్లాల నుంచి కదలి రానున్న భక్తులు
- ఐదు రోజులు జన సంద్రంలా మారనున్న కుర్నవల్లి
- 27 నుంచి మార్చి 2 వరకు ఉత్సవాలు

కరకగూడెం, ఫిబ్రవరి 24: గిరిజన ఆరాధ్య దైవం అయిన సమ్మక్క- సారలమ్మ జాతర రెండేళ్ల కొకసారి మేడారం సమ్మక్క సారలమ్మ జాతర తర్వాత అంగరంగ వైభవంగా సమత్ భట్టుపల్లి పంచాయితీ కుర్నవల్లిలో జరగనుంది. పోలెబోయిన వంశీయులు అయిన పోలెబోయిన కరుణకర్ దేవరబాల(పూనకంతో భక్తుల కోర్కెలు తీర్చు) ఇంటి ఇలవెల్పు ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ జాతరకు మూడు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులను చెల్లించుకుంటారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం సమత్ భట్టుపల్లి పంచాయితి కుర్నవల్లి గ్రామం పరిధిలో సమ్మక్క- సారలమ్మ జాతర 27వ తేదీ మంగళవారం మండమెలుగు కార్యక్రమం నుంచి ప్రారంభం కానున్న జాతర మార్చి 2వ తేదీ శనివారం వనదేవతలను గుట్టకు చేర్చడంతో ముగిస్తుంది.



జాతరకు ముస్తాబవుతున్న ప్రాంగణం, వనదేవతలు కొలువు తీరనున్న గద్దెలు

మూడు రోజుల పాటు జరగనున్న ఈ సమ్మక్క- సారలమ్మ మహా జాతరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఖమ్మం, వరంగల్, ములుగు జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు ఇక్కడకు వచ్చి అమ్మవార్లను దర్శించుకుంటారు.

27న మండమెలుగు కార్యక్రమం నిర్వహించగా.. 28 బుధవారం ఒక్క పొద్దుతో పాటు రాత్రి 10 గంటలకు గట్టు నుంచి సారలమ్మను భక్తి శ్రద్ధలతో గద్దెలపై కొలువు తీర్చుతారు. 29 గురువారం నందిగామా గుంట నుంచి సమ్మక్క, పగిడిద్దరాజు, నాగులమ్మను పూజారులు వనం నుంచి గిరిజన సంప్రాదాయలు, డప్పు వాయిద్యాలు, పూనకాలతో జన సంద్రంలో మధ్యహ్నం 2గంటలకు ఎదురుకోలు నిర్వహించి.. గద్దెలపై కొలువు తీర్చుతారు.

రాత్రి 12 గంటలకు పగిడిద్దెరాజు, సారలమ్మకు కన్నుల పండుగగా కల్యాణం నిర్వహిస్తారు. మార్చి 1న శుక్రవారం శుంకు పండుగా.. భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులకు దేవరబాల పోలెబోయిన కరుణకర్ తీర్థ ప్రసాదలు అందజేస్తారు. మార్చి 2 శనివారం వనదేవతలను డప్పు వాయిద్యాలతో గుట్టకు చేర్చుడంతో జాతర ముగింపు అవుతుందని జాతరకు అన్ని ఏర్పట్లు పూర్తి అయ్యాయని దేవరబాల కరుణకర్ తెలిపారు.

ఎంపీపీపై అవిశ్వాసం

- ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన ప్రాదేశిక సభ్యులు
- సుజాతనగర్‌లో మొత్తం ఎంపీటీసీలు 8మంది
- బల పరీక్షకు 27న ముహూర్తం

సుజాతనగర్, ఫిబ్రవరి 24: సుజాతనగర్ ఎంపీపీ భూక్యా విజయలక్ష్మిపై మెజారిటీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. ఈ నెల 7వ తేదీన కొత్తగూడెం ఆర్డీవోని కలిసి ఫిర్యాదు చేశారు. ఈనెల 27వ తేదీన అవిశ్వాసంపై ఓటింగ్ జరుగనుంది.

మండలంలో మొత్తం 8 మంది ఎంపీటీసీలు సభ్యులు ఉన్నారు. ఎంపీపీగా ఉన్న భూక్యా విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీ తరుపున గెలవగా, వైస్ ఎంపీపీగా బానోత్ అనిత ఇండిపెండెంట్ గా గెలిచారు. దీనితో బీఆర్ఎస్ పార్టీ నుంచి ముగ్గురు ఎంపీటీసీలు, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, సీపీఐ నుంచి ఇద్దరు, ఇండిపెండెంట్‌గా ఒక్కరు గెలిచారు.

బీఆర్‌పార్టీ ఎంపీపీ పదవిని చేజిక్కించుకోవడానికి కాంగెస్ నుంచి గెలిచిన భూక్యా విజయలక్ష్మిని, ఇండిపెండెంట్‌గా గెలిచిన ఇద్దరినీ బీఆర్ఎస్ పార్టీలోకి తీసుకుని ఇద్దరికీ చెరో రెండున్నరేళ్ల ఎంపీపీగా కొనసాగేలా అప్పటి ఎమ్మెల్యే వనమా, బీఆర్ఎస్ పార్టీ పెద్దలు ఒప్పందం చేసుకున్నారు.



పెద్దల హామీ మేరకు ఏప్రిల్, 2022 నాటికే ఎంపీపీగా ఉన్న భూక్యా విజయలక్ష్మి పదవి నుంచి వైదొలగి వైస్ ఎంపీపీగా ఉన్న అనిత ఎంపీపీ కావాల్సింది. అయితే అది కార్యరూపం దాల్చకపోవడతంతో రాసుకున్న ఒప్పందం ప్రకారం అగ్రిమెంట్‌ను అమలు చేయాలని, ఒప్పందం ప్రకారం తనకి ఎంపీపీ పదవి ఇవ్వాలంటూ అనిత అప్పటి నుండి డిమాండ్ చేస్తూ వస్తున్నారు. కానీ భూక్యా విజయలక్ష్మి మాత్రం తాను ఎంపీపీ పదవి వదిలేది లేదంటూ భీష్మించుకున్నారు. దీనితో వైస్ ఎంపీపీగా ఉన్న అనిత అసంతృప్తితో ఉంది. ఇప్పటికి అవకాశం రావడంతో అవిశ్వాసంతో నైనా ఎంపీపీ కుర్చీ కోసం పలువురు ఎంపీటీసీల మద్దతుతో ఆమె ఆర్డీఓకి ఫిర్యాదు చేశారు.

లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణే కమ్యూనిస్టుల లక్ష్యం: తమ్మినేని

ముదిగొండ, ఫిబ్రవరి 24: దేశాన్ని హిందుత్వ దేశంగా మార్చేందుకు సంఘ్‌పరివార్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని, లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అని అన్నారు. శనివారం ముదిగొండ మండలం అయ్యగారిపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన సీపీఎం సీనియర్ నాయకుడు బొజ్జా గాంధీ సంతాప సభ, నూతనంగా ఏర్పాటుచేసిన గాంధీ స్మారక స్థూపాన్ని తమ్మినేని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ మనువాద బీజేపీ దేశంలో మత రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయ లబ్ధి పొందుతుందని ఆరోపించారు. హిందుత్వ భావాజాలాన్ని ప్రజల్లో పెంచి కాషాయికరణ చేసేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. దేశాన్ని విచ్ఛిన్నకర శక్తులైన మోదీ, అమిత్‌షా ద్వయం నుంచి రక్షించాలంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కూటమిని ఓడించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం ప్రతిపాదిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యం మనుమరుగవు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బొజ్జా గాంధీ పార్టీకి, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, బండి రమేష్, బండి పద్మ, బట్టు పురుషోత్తం, మంకెన దామోదర్, టీఎస్.కల్యాణ్, మరికంటి వెంకన్న, రామచంద్రం, వెంకన్న, భద్రయ్య, ఇరుకు నాగేశ్వరరావు, బొజ్జా గాంధీ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



గాంధీ స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం

ఈకేవైసీ ఉంటేనే 'కిసాన్ సమ్మాన్'

- తప్పులు సరిచేసుకునేందుకు అధికారులను సంప్రదించాలి
- మొబైల్ ఫోన్లలోనూ రైతులు సరిచేసుకునే అవకాశం

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 24: ఇక నుంచి ఈకేవైసీ ఉంటేనే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వర్తించనున్నది. ఈకేవైసీ లేని రైతులకు ఈ పథకం కింద లబ్ధి చేకూరదు. రైతులు తమ స్టేటస్ తెలుసుకునేందుకు https://pmkisan.gov.in/ ఫార్మర్ కార్నర్‌లో తెలుసుకోవచ్చు. ఈకేవేసీ లేనట్లయితే వెంటనే చేయించుకోవాలి. ఇది ఉంటేనే వచ్చే విడుత కింద ఎకరాకు రూ.2 వేల చొప్పున జమవుతాయి. ప్పటికే ఈకేవైసీ పూర్తి చేసుకుని ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు.

ఒక వేళ చేసుకోని రైతులు తమ మొబైల్ ఫోన్‌లో క్రోమ్ బ్రౌజర్‌లో పీఎం కిసాన్ వెబ్‌సైట్‌కు వెళ్లాలి. అక్కడ ఈకేవైసీ అనే ఆప్షన్ ఉంటుంది. దీని ద్వారా రైతులు ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. ఆధార్ రిజిస్టర్ మొబైల్ నంబర్ కచ్చితంగా రైతుల వద్ద ఉండాలి. అప్పుడే ఆన్‌లైన్‌లో ఓటీపీ నంబర్లు నమోదు చేసి ఈ పని పూర్తి చేసుకోవచ్చు. ఒక వేళ మొబైల్ నంబర్‌తో ఆధార్ లింక్ కాకుంటే బయోమెట్రిక్ లేదా ఫేస్ ఆప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. ఇందుకు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని గానీ, మండల వ్యవసాయ అధికారినిగానీ సంప్రదించాలి. ఈ పథకం కింద ఎవరైనా రైతులు సెల్ఫ్ రిజిస్ట్రేషన్ కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా గానీ, లేదా స్వయంగా గానీ నమోదు చేసుకున్న తర్వాత వారి ఖాతాల్లో ఇంకా డబ్బులు జమ కానట్లయితే పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ ఖాతా పుస్తకం, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ వివరాలతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని గానీ, మండల వ్యవసాయ అధికారిని గానీ సంప్రదించాలి. ఫార్మర్స్ కార్నరల్ ఆధార్ వెరిఫికేషన్ స్టేటస్ పెండింగ్ అని చూపించినట్లయితే వెంటనే ఎడిట్ ఆధార్ ఫెయిల్యూర్ రికార్డ్స్ ఆప్షన్ ద్వారా సరి చేసుకోవాలి. ఆ తర్వాతనే పథకం కింద నగదు రైతుల ఖాతాలో జమవుతుంది.



చూడాల్సినవి..

బ్యాంక్ వివరాలు తప్పుగా నమోదు కావడం, ఇతర కారణాల వల్ల డీబీటీ ఫెయిల్/పీఎఫ్ఎంఎస్ రిజెక్షన్ అని వచ్చిన వెంటనే బ్యాంక్ ఖాతా పుస్తకం, ఆధార్ కాపీతో వెంటనే బ్యాంక్ అధికారులను సంప్రదించి ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేయించుకోవాలి. ఇందుకోసం 2019 ఫిబ్రవరి 1 నాటికి రైతులు పట్టాదారులై ఉండాలని, కుటుంబంలో ఒక్కరే లబ్ధిదారులై ఉండాలి.

మహాత్ముడి బాటలో పయనించాలి: ఎమ్మెల్యే జారే



మద్దికొండలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 24: అహింసా మార్గంలో పోరాటం చేసిన జాతిపిత మహాత్ముడి బాటలోనే అందరూ పయనించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. మండలంలోని మద్దికొండలోని ప్రాథమిక పాఠశాలలో ఎంపీటీసీ సభ్యురాలు కాసాని దుర్గ, మురళీ దంపతులు ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని శనివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, అచ్యుతాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. చిన్నారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రమోద్, నంద్రు రమేశ్, హరిబాబు, కొల్లు చంద్రం, కాసాని పద్మశేఖర్, తాటి రామకృష్ణ, లక్ష్మణరావు, విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ భవాని పాల్గొన్నారు.

ప్రీ లోక్‌అదాలత్‌లో 15 కేసుల పరిష్కారం

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 24: మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన ప్రీ లోక్ అదాలత్ కార్యక్రమంలో 15 కేసులు పరిష్కారమయ్యాయి. మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ మణుగూరు చైర్మన్, మెజిస్ట్రేట్ ఎం. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసే చిన్న పొరపాట్ల వల్ల క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుపోయిన కక్షిదారులు ఈ లోక్‌అదాలత్‌లను వినియోగించుకుని ప్రశాంత జీవితాన్ని పొందాలన్నారు. రాజీ పడదగిన కేసుల్లో కక్షిదారులందరు రాజీ పడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ చిర్ర రవి కుమార్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సర్వేశ్వరరావు, న్యాయవాదులు పోశం భాస్కర్, రుద్రవెంకట్, వాసవీ, కోర్టు బెంచ్ క్లర్క్ రేఖ, ఏడూళ్లబయ్యారం కోర్టు కానిస్టేబుల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు కాపీని అందజేస్తున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

డీపీఆర్‌వో సేవలు అభినందనీయం

కొత్తగూడెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారిగా పనిచేసిన సీలం శ్రీనివాస్ చేసిన సేవలు అభినందనీయమని జర్నలిస్టు సంఘాల నాయకులు అన్నారు. బదిలీపై భూపాలపల్లి జిల్లాకు వెళ్తున్న శ్రీనివాస్‌కు వీడ్కోలు సభను డీఆర్‌డీవో సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఐజేయూ జాతీయ నాయకుడు దుద్దుకూరి రామారావు మాట్లాడుతూ డీపీఆర్‌వోగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని పాత్రికేయులకు అందిస్తూ సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కళ్లోజి శ్రీనివాస్, ఇమ్మంది ఉదయ్‌కుమార్, వట్టికొండ రవి, చంద్ర నర్సింహరావు, కొండలరావు, టీవీ నాగాచారి, నర్సింహరావు, షఫి, ఇన్‌చార్జ్ డీపీఆర్‌వో అజ్గర్‌హుస్సేన్, సిబ్బంది రాజేష్, ఫణి తదితరులు పాల్గొన్నారు.



డీపీఆర్‌వో శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

విరివిగా సేవా కార్యక్రమాలు చేపట్టాలి

- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి24: గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విరివిగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. శనివారం జూలూరుపాడుకు చెందిన జేపీఆర్ఎస్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఇడుపుల రాజు, సభ్యులు ఎస్పీ రోహిత్‌రాజును కార్యాలయంలో కలిసి మెమోంటో, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఎస్పీకి తెలియజేశారు. చిన్న వయస్సులోనే ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్న రాజును ఆయన అభినందించారు. రానున్న రోజుల్లో సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి నిరుపేదలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి మెమొంటోను అందజేస్తున్న రాజు

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
ఆదివారం 25 ఫిబ్రవరి 2024

పెద్దమ్మగుడిలో ఘనంగా చండీహోమం


ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పాల్వంచ, ఫిబ్రవరి 24: పాల్వంచ మండలం జగన్నాధపురం గ్రామంలోని శ్రీకనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో శనివారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమి రోజున నిర్వహించే ఈ కార్యక్రమాన్ని దేవస్థాన యాగశాలలో నిర్వహించారు. చండీహోమంలో పాల్గొన్న 19 మంది జంటలకు (దంపతులకు) అమ్మవారి శేషవస్త్ర ప్రసాదములను అందించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు మహిపతి రామలింగం, సభ్యులు చింతా నాగరాజు, సందుపట్ల శ్రీనివాసరెడ్డి, గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

108కు గూడు కరువు..

» అత్యవసర సేవలకు నీడ లేదు » గూడెంలో 108 వాహన దుస్థితి » చెట్ల నీడన ఉంటున్న వైనం


కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ వద్ద రాత్రి సమయంలో నిలిచి ఉన్న 108 వాహనం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 24: జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో అత్యవసర సేవలైన 108 వాహనాలకు గుర్తింపు లేకుండా పోయింది. రోడ్డు ప్రమాదాలు, అనారోగ్య సమస్యలు ఉన్న వారికి తీరిక లేకుండా వైద్య సహాయం కోసం అందిస్తున్న వాహనాలకు, ఉద్యోగులకు నిలువనీడ కరువైంది. జిల్లా ఏర్పడి సుమారు 10 ఏళ్ళు గడిచినప్పటికి 108 వాహనాలకు కేర్ ఆఫ్ అడ్రాస్ ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బస్టాండ్ సెంటర్ చెట్ల నీడలో 108 వాహనాలు

కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గోయింగ్ రోడ్డు ముందే 108 వాహనాలను నిలపాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు కొన్ని నెలలుగా అత్యవసర వాహనాలను బస్టాం డ్ ప్రాంతంలోని చెట్ల నీడలో నిలిపి కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో వాహనాలలోని ఉద్యోగులు, సిబ్బంది విశ్రాంతి తీసుకోవడం గమనార్హం. 108 వాహన డ్రైవర్‌తో పాటు, మహిళ సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతం. అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత వైద్య ఆరోగ్య రంగంలో అత్యవసర సేవలు అందిస్తున్న 108 వాహనాలకు నిలువ నీడకై కార్యాలయం లేకపోవడం ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తుంది. మహిళా సిబ్బంది ఇక్కట్లు తప్పడం లేదు. వారి వ్యక్తిగత భద్రతకు భంగం వాటిల్లే అవకాశం పొంచి ఉంది. తాము పడుతున్న ఇబ్బందులను పరిగణలోనికి తీసుకొని జిల్లా ఏర్పడక ముందు కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో 108 వాహనాలకు స్వంత భవనాన్ని అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఉమ్మడి జిల్లా నుంచి భద్రాద్రి జిల్లా వేరు కావడంతో 108 కార్యాలయాన్ని తీసివేశారు. ఆ ప్రాంతంలోనే రైటర్ బస్తీలో సింగరేణి క్వార్టర్స్‌లో 108 కార్యాలయాన్ని ఏర్పాటు చేసినప్పటికి అక్కడి నుంచి కూడా తొలగించడంతో వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాత ఆర్డీవో కార్యాలయంలో ఉన్న భవనాన్ని తమకు కేటాయించాలని సిబ్బంది కోరుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం

భూమా నాగేందర్ ఉమ్మడి జిల్లా ప్రొగ్రామ్ మేనేజర్

కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో గతంలో ఉన్న పాత కార్యాలయాన్ని 108 వాహన సేవలకు కెటాయించాలని జిల్లా అధికారులకు నివేధికను అందించాం. పాత కార్యాలయాన్ని 108 కేంద్రానికి అందించి ఉద్యోగులు, సిబ్బంది పడుతున్న ఇబ్బందులను తొలిగించే విధంగా కృషి చేస్తాం.

నాణ్యతకు తిలోదకాలు!

» నాసిరకంగా బస్టాండు ప్రహరి నిర్మాణం » కొరవడిన అధికారుల పర్యవేక్షణ » పట్టించుకోని ఆర్టీసి అధికారులు


నాసిరకం ఇసుక

దమ్మపేట, ఫిబ్రవరి, 24: దమ్మపేట బస్టాండు ఆవరణ చుట్టూ నిర్మిస్తున్న ప్రహరి నిర్మాణ పనులు నాసిరకంగా నిర్మిస్తున్నారు. లక్షల రూపాయిలతో నిర్మించే నిర్మాణాలకు ఆర్టీసి అధికారులుగాని, ఇంజనీరింగ్ పర్యవేక్షణ పూర్తిగా కొరవరడింది. అధికారుల పర్యవేక్షణ లేకుండానే ఇష్టారాజ్యంగా ప్రహరి నిర్మాణ పనులను చేస్తున్నారు. ప్రహరి నిర్మాణం కోసం స్థానిక వాగుల నుంచి సేకరించి ఇసుకలో లెక్క పత్రం లేకుండా పెద్ద ఇసుక గుట్టపై రెండు సిమెంట్ కట్టలు పోసి కలిపివేసి ప్రహరి నిర్మాణం చేపడుతున్నారు. ఇంజనీరింగ్ అధికారులు కాని ఆర్టీసి అధికారులు లేకుండానే ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. నిర్మాణ పనులపై సమాచారం ఇవ్వకుండా ఆర్టీసి అధికారులు గోపత్య పాటించటం వల్ల పలు అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. వీటికి బలం చేకూర్చే విధంగా బస్టాండు ప్రహరి నిర్మాణం అధికారుల పర్యవేక్షణ లేకుండానే హడా వుడిగా నిర్మాణం చేపట్టడంపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.


ప్రహరి నిర్మాణం

ఆర్టీసి అధికారులు మేడారం జాతర హడావుడిలో ఉన్నట్లు చెపుతున్నారు. ఇదే అదునుగా నాసిరకంగా నిర్మాణం చేపట్టిన అధికారులు పట్టించుకోరని హడా వుడిగా ప్రహరి నిర్మాణం పనులు చేపడుతున్నారు. నిర్మాణ పనులపై సత్తుపల్లి ఆర్టీసి డీఎం రాజ్యలక్ష్మిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు. ఇంజనీరింగ్ జేఈ రహీంను వివరణ కోరగా తాను మేడారంలో వున్నానని పనుల పర్య వేక్షణ వర్కు ఇన్స్‌పెక్టర్ పరిశీలిస్తున్నట్లు తెలపారు. పనుల వద్ద మీసిబ్బంది ఎవరు లేరని ఆయన దృష్టికి తీసుకు వెళ్ళగా సాయంత్రం వచ్చి పనులు చూస్తారని ముక్తసరిగా సమాధానాన్ని దాట వేశారు. అధికారుల పర్యవేక్షణ లేకుండా చేపడుతున్న ప్రహరినిర్మాణ పనులనులపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా చేపడుతున్న నిర్మాణపు నులపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

కాకినాడ జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్‌కు సన్మానం


సన్మానిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఫిబ్రవరి 24: కాకినాడ జేఎన్టీయు వైస్ ఛాన్సలర్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజును డా.పాల్ రాజ్ ఇంజనీరింగు కళాశాల కో ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ సభ్యుల డాక్టర్ కె.అబ్రహం ఘనంగా సన్మానించారు. జీవీఆర్ ప్రసాదరాజు భద్రాచలం వచ్చిన సందర్భంగా ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి అబ్రహం శాలువాతో సత్కరించడంతో పాటు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి జ్ఞాపికను అందజేశారు.

జాతర మహోత్సవాలు ప్రారంభం

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 24: మండలంలోని నారంవారిగూడెం కాలనీ విజయ భవాని ఆలయంలో ఐదు రోజులు జరిగే 18వ జాతర మహోత్సవాలు శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.45 గంటలకు కలశస్థాపన, అఖండ దీపారాధనతో పూజలు ప్రారంభించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు చేశారు. అర్చకులు మేడూరి సాంబశివప్రసాద్ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గేదెల విష్ణు దంపతులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధికంగా తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 24: అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం భక్తిశ్రద్దలతో ఘనంగా వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రదానార్చకులు ప్రసాద చార్యులు సాంప్రదాయ రీతిలో శాస్త్రోక్తంగా పూజలు, అర్చనలు నిర్వహించారు. చుట్టు ప్రకల గ్రామాలకు చెందిన భక్తులు భక్తిశ్రద్దలతో స్వామివారి కళ్యాణం తిలకించి తీర్ధప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కాకర్ల వేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు

జూలూరుపాడు, ఫిబ్రవరి 24: తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహకారంతో మండలంలోని కాకర్ల వేణుగోపాలస్వామి ఆలయంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామివ్రతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వ్రతాలలో గ్రామానికి చెందిన భక్తులు, దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, సభ్యులు రమా, ఆలయ కమిటీ అధ్యక్షుడు అల్లాడి నరసింహారావు, మిర్యాల రమేష్, గోగుల వెంకటేశ్వర్లు, నరేష్, కళ్యాణం వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై చర్యలకు డిమాండ్

దుమ్ముగూడెం ఫిబ్రవరి 24: సీతానగరం గ్రామ ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వ స్థలాన్ని ఓ గిరిజనేతరుడు ఆక్రమించి ఇల్లు నిర్మాణానికి ప్రయత్నిస్తున్న వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లు శనివారం డిమాండ్ చేశారు. 1-70 చట్టానికి విరుద్ధంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. బుర్రవేముల ప్రాంతంలోనూ ఏజన్సీ చట్టాలను దిక్కరించి అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారని నాయకులు కోరం మురళి, వాగె వెంకటేష్, తాటి మహేష్‌లు ఆరోపించారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు

జూలూరుపాడు, ఫిబ్రవరి 24: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న నేపధ్యంలో పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలు శనివారం జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. పరీక్షల డిపార్ట్‌మెంటల్ అధికారి సముద్రాల శ్రీనివాస్, చీఫ్ సూపరెండెంట్ పద్మజలు వాటిని పెట్టెల్లో పెట్టి సీల్ వేసి స్టేషన్‌లో భద్రపరిచారు. వారు మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి సెట్ - 1కు చెందిన అన్ని సబ్జెక్ట్‌ల ప్రశ్నా పత్రాలు వచ్చాయని, మిగిలిన సెట్‌ల ప్రశ్నా పత్రాలు రెండు, మూడు రోజుల్లో చేరుకుంటాయని తెలిపారు. పరీక్షల నిర్వాహణకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూట్ ఆఫీస్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయసంకల్ప యాత్రను జయప్రదం చేయండి: బీజేపీ

పాల్వంచ టౌన్, ఫిబ్రవరి 24 : విజయసంకల్ప యాత్రను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు కార్యకర్తలను కోరారు. శనివారం పాల్వంచ పట్టణ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పొనిశెట్టి పాల్గొన్నారు. విజయసంకల్ప యాత్రకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు రాపాక రమేష్, గంధం ప్రసాద్, కటికల రంజిత్, ధారావత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ కార్యకర్త మృతి

● నివాళులర్పించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 24: మండల పరిధిలోని పేరాయిగూడేం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త నార్లపాటి శ్రీను (38) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేరాయిగూడెం వెళ్లి నార్లపాటి శ్రీనివాసారావు భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియార్ నాయకులు నార్లపాటి రాములు నండ్రు రమేష్, తగరం ముత్తయ్య, నార్లపాటి మహే ష్, తగరం రాజేష్ పాల్గొన్నారు

మణుగూరు ఏరియాలో వాహనాలకు టెండర్లు

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 24: మణుగూరు ఏరియాలోని పీకేఓసీ నందు నాన్ ఏసీ 4 వీల్ డ్రైవ్ 4 ప్లస్ 1 సీటింగ్ సామర్థ్యం కలిగిన బీఎస్-4 పికప్ వ్యాన్‌ల కొరకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వాహన యజమానులు 26వ తేదిలోపు ఏరియా జీఎం కార్యాలయంలోని సంబంధిత సెక్షన్‌లో దరఖాస్తు చేయాలని కోరారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 24: మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ విజయ భాస్కర్ రెడ్డి కోరారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.. 0-5 సంవత్సరాలు కల్గిన చిన్నారులకు పోలియో చుక్కలు కార్యక్రమం నిర్వహించబడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మడివి సరస్వతి, తహసీల్దార్ వివేక్, ఎంఈవో శ్రీరామ్మూర్తి, సీడీపీవో కనకదుర్గ, ఉల్వనూర్ పీహెచ్‌సీ డాక్టర్ తేజశ్రీ, జగన్నాథపురం పీహెచ్‌సీ డాక్టర్ రాజు, మున్సిపల్ అధికారులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

పినపాక, ఫిబ్రవరి 24: మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం మండల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ దుర్గాభవానీ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా వేసవిలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హెచ్ఎం సామ్రాజ్యం, హెచ్ఈవో వీరాస్వామి, హెల్త్ అసిస్టెంట్ వెంకట్, పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం

కొత్తగూడెం సాంస్కృతికం, ఫిబ్రవరి 24: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని కొత్తగూడెం విద్యానగర్‌కాలనీలోని శ్రీపద్మావతి గోదా సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనవారం లక్ష్మీసుదర్శన హోమం ను భక్తిశ్రద్దలతో నిర్వహించారు. గోవిందనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ నిర్వాహకులు పి.వి.వర్ధన్ రావు, శ్రీనివాస్, వాసిరెడ్డిప్రసాద్ తదిరులు పాల్గొన్నారు.

పొదెం వీరయ్యను మంత్రివర్గంలోకి తీసుకోవాలి

» మోకాళ్లపై రామాలయం మెట్లు ఎక్కిన కాంగ్రెస్ నాయకులు


మోకాళ్లతో మెట్లెక్కుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

భద్రాచలం, ఫిబ్రవరి 24: భద్రాచలం మాజీ శాసన సభ్యులు పొదెం వీరయ్యకు ఎమ్మెల్సీగా నియమించి రాష్ట్ర క్యాబినేట్‌లో స్థానం కల్పించాలని భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ ప్రధాన మెట్లను శనివారం కాంగ్రెస్ నాయకులు మోకాళ్లతో ఎక్కారు. అనంతరం ఆలయంలో మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు తరుణ్‌మిత్రా మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు నుంచి వచ్చి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించిన పొదెం వీరయ్యను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ప్రలోబాలకు గురి చేసినా తాను నమ్మిన కాంగ్రెస్ పార్టీని, మూడు రంగుల జెండాను వీడలేదన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలైన వీరయ్యకు పార్టీ అధిష్టానం, ముఖ్యమంత్రి ఎమ్మెల్సీగా నియమించి క్యాబినేట్‌లో అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. దీని ద్వారా భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవకాశం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిలకా వెంకటరమణారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ వేలానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 24: ఇల్లెందు మున్సిపాలిటి పరిధిలోని 7వ వార్డులో షాపింగ్ కాంప్లెక్స్, కమ్యూనిటి హాల్‌కు బహిరంగ వేలానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ నవీన్‌కుమార్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో బహిరంగ వేలంపై వివరించారు. ఒక సంవత్సర కాలంపరిమితికి ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ప్రతీ నెల అద్దె ప్రాతిపదికన కిరాయి రూ.22 వేలు, అద్దెకు ఇచ్చేందుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మాణం మేరకు కిరాయి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను ఈ నెల 29 లోపు అందించాలని సూచించారు.

యువకులు క్రీడల్లో రాణించాలి: ఎమ్మెల్యే వెంకట్రావు


యువకులతో ఎమ్మెల్యే తెల్లం

చర్ల, ఫిబ్రవరి 25: యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, చర్ల సీఐ రాజువర్మ, ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి అన్నారు. శనివారం చర్ల మండలం కత్తిగూడెం గ్రామంలో ముగిసిన క్రికెట్ క్రీడాపోటీల్లో పాల్గొని మాట్లాడారు. ప్రతీ యువకుడిలో ప్రతిభ దాగి ఉంటుందన్నారు. క్రమశిక్షణలో అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన చీమల పాడు జట్టుకు రూ.30 వేల నగదు, షీల్డ్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన వెంకటాపురం జట్టుకు రూ.20వేల నగదు, షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గీదా కోదండరామయ్య, చర్ల ప్రముఖులు కొట్టేరు శ్రీనివాస్ రెడ్డి, ఇర్పా వసంత్, ఇతరులు ఉన్నారు. అనంతరం చర్ల తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులు అందజేశారు. ప్రభుత్వ పథకాలు ప్రతీ ఒక్కరికీ అందాలని అధికారులకు సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

బూర్గంపాడు, ఫిబ్రవరి 24: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన శనివారం బూర్గంపాడులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడు పాత బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడిని శనివారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతను తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతుని వివరాలు ఆరాతీశారు. మృతదేహన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు లభ్యం కాలేదని వలస ఆదివాసీగా భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుని వయసు సుమారు 20సంవత్సరాలు ఉంటుందని తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

దమ్మపేట, ఫిబ్రవరి, 24: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ యువతి శనివారం మృతి చెందింది. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లగూడెం గ్రామానికి చెందిన మానస (24) ఈనెల 22న పురుగుల మందు తాగింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు వెంటనే దమ్మపేట, అశ్వారావుపేట, ఖమ్మం వైద్యశాలలకు తరలించి చికిత్స చేస్తుండగా శనివారం మృతి చెందింది. తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మాజీ ఉపసర్పంచ్‌కు ఎమ్మెల్యే పాయం పరామర్శ

మణుగూరురూరల్, ఫిబ్రవరి 24: మణుగూరు మండల పరిధిలోని తొగ్గూడెం మినీ మేడారం సమ్మక్క-సారాలమ్మ జాతరలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పంచాయతీ మాజీ ఉపసర్పంచ్, జాతర కమిటీ సభ్యులు వీరంకి వెంకట్రావ్‌గౌడ్‌ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించారు. తొగ్గూడెంలోని వెంకట్రావ్ ఇంటికి వెళ్లి శనివారం పరామర్శించారు. శుక్రవారం తొగ్గూడెం సమ్మక్క-సారాలమ్మ ఆలయం వద్ద ఓ వాహనం డీ కొట్టిందని, చికిత్స నిమిత్తం భద్రచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య చికిత్సలు తీసుకున్నట్లు ఎమ్మెల్యేకు వెంకట్రావ్‌గౌడ్ తెలిపారు. వెంకట్రావ్‌ను కూనవరం ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, కాం గ్రెస్ నాయకులు ఎస్‌కే బాజీ, గాండ్ల సురేష్, కొమరం రా మూర్తి, త్రీమూర్తులలతోపాటు, ఉత్సవ కమిటీ సభ్యులుసత్యవతి, నాయకులు కూడా పరామర్శించిన వారిలో ఉన్నారు.

పామాయిల్ గెలల ట్రాక్టర్ల పట్టివేత

దమ్మపేట, అశ్వారావుపేట, ఫిబ్రవరి, 24: అక్రమంగా ప్రైవేట్ ప్యాక్టరీకి తరలిస్తున్న పామాయిల్ గెలల ట్రాక్టర్లను శనివారం అల్లిపల్లి ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో ఆయిల్‌ఫెడ్ సిబ్బంది పట్టుకున్నారు. అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..దమ్మపేట మండలం నుంచి ఆంధ్ర ప్రాంతానికి చెందిన గోద్రెజ్ కంపెనీకి రెండు ట్రాక్టర్లలో పామాయిల్ గెలలను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఆంధ్ర బోర్డర్ అయిన అల్లిపల్లి, మేడిశెట్టి వారిపాలెం వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమం గా పామాయిల్ గెలలను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పాల్వంచ, ఫిబ్రవరి 24: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని పునుకుల గ్రామానికి చెందిన బానోత్ శ్రీను(42) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతరులకు పంట పెట్టుబడిగా అప్పు ఇస్తుండేవాడు. ఈ క్రమంలో అప్పు తీసుకున్న వ్యక్తి వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి ఈ నెల 19న ఖమ్మం వెళ్లాడు. ఇంటికి తిరిగిరాకపోవడంతో శ్రీను కోసం బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. శ్రీను భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

రాజేశ్వరరావుకు ఎమ్మెల్సీ తాతా మధు పరామర్శ

దమ్మపేట, ఫిబ్రవరి, 24: దమ్మపేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దొడ్డాకుల రాజేశ్వరరావును ఎమ్మెల్సీ తాతా మధు శనివారం సాయంత్రం పట్వారిగూడెంలో ఆయన నివాసంలో పరామర్శించారు. కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో చుంచు విజయ్‌కుమార్, డోకుపర్తి సుబ్బారావు, జడ్పీటీసి వెంకటేశ్వరరావు, దారా యుగందర్, ఎంపీటిసి దేవరపల్లి అజయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యులు బుడే, అబ్దుల్ జిన్నా, మాజీ ఉపసర్పంచ్ రెడ్డిమళ్ల నాగయ్య వున్నారు.

సైన్స్‌ఫేర్ సృజనాత్మకతను పెంచుతుంది: ఎంఈవో



విద్యార్థులు తయారు చేసిన నమూనాలు

దమ్మపేట, ఫిబ్రవరి, 24: సైన్స్‌ఫేర్ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతుందని ఎంఈవో లక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్‌మేరిస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఎంఈవో మాట్లాడుతు సైన్స్‌ఫేర్ ఏర్పాటు చేయటం వల్ల విద్యార్థులు కొత్తకొత్త ఆలోచనలతో సైన్స్ పరిజ్ఞానంతో ఎన్నో నూతన ఆవిష్కరణలకు ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు 100పైగా సైన్స్ కృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి దమ్మపేటలోని పలుపాఠశాలల విద్యార్థులు హాజరై సైన్స్‌ఫేర్ తిలకించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ ఫాదర్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సైన్స్‌ఫేర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో

రైతులపై కాల్పులకు నిరసనగా ఆందోళన

» కేంద్ర దిష్టిబొమ్మ దహనం

జూలూరుపాడు, ఫిబ్రవరి 24: పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులకు ఇబ్బందికరంగా ఉన్న మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి కాల్పుల జరపడం అమానుషమని సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు విమర్శించారు. రైతులపై కాల్పులకు నిరసనగా శనివారం జూలూరుపాడులో సీపీఐ - తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ హర్యానా ప్రాంతంలో కేంద్ర బలగాలు రైతులపై క్రూరత్వంగా కాల్పులు జరపడం అమానుషమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బిజెపిని ఓడించి తగిన గుణపాటం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింత స్వరాజ్‌రావు, సంఘం మండల కార్యదర్శి యాసా రోశయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.నాగూల్‌మీరా, సీపీఐ నాయకులు ఎస్‌కె.చాంద్‌పాషా, గార్లపాటి వీరభద్రం, ఎన్.లక్ష్మయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శుభకరణ్‌సింగ్ హత్యను ఖండించాలి

ఇల్లెందుటౌన్: వ్యవసాయ వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై కాల్పుల్లో యువరైతు శుభకరణ్‌సింగ్ హత్యచేయడగా, వారి హత్యను ఖండించాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం ఇల్లందులో ఐఎఫ్‌టీయూ, సంఘాల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఐఎఫ్‌టీయూ రెండు సంఘాల నాయకులు సారంగపాణి, రామ్‌సింగ్, నాయకులు సామిల్, నర్సింహరావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు

పాల్వంచ టౌన్: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాల్వంచలో శనివారం ఐఎఫ్‌టీయు నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నటరాజ్ సెంటర్లో నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు దరించి నిరసన తెలిపారు. ఐఎఫ్‌టీయు రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు, జిల్లా కోశాధికారి మోత్కూరి మల్లిఖార్జునరావు, రాము, మధు, వినోద్, రాములు, రమేష్, తరుణ్, పవన్, చుక్కన్న, శ్రీనివాస్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.





జూలూరుపాడు, పాల్వంచ, ఇల్లెందులో ఆందోళన చేస్తున్న వామపక్షాల నాయకులు